


# తల్లి వేరు

-హైమా భార్గవ్

ఉగాది తనతోబాటు కొత్త సంవత్సరాన్నీ, వసంతాన్నీ, కోయిల పాటలనూ వెంటబెట్టుకు వచ్చింది.

తల స్నానం చేసి వాకిట్లోకి వచ్చిన శ్రీకాంత్‌కు గుమ్మంలో మావిడాకుల తోరణం కట్టాలనే విషయం గుర్తుకొచ్చింది. మేడ మీదకు వెళ్ళి మావిడి చెట్టు నుండి ఆకులు కోశాడు. విరగకాచిన కాయలతో, పచ్చటి ఆకులతో ఆ చెట్టు వసంతానికి ప్రతినిధిలా ఉంది. కోయిల గొంతు కేవలం ఉగాది కవి సమ్మేళ నాల్లోనే కాదు... ఇలాంటి ఇంటి ఆవరణలో వుండే చెట్టు మీద నుండి కూడా వినపడు తుంది సుమా అని లోకానికి చాటుతున్నట్లు కోయిల స్వరం కమ్మగా వినపడుతోంది.

ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

శ్రీకాంత్ డాబా మీద కలియదిరుగుతూ ఇంటి చుట్టూ ఉన్న తోటను చూసుకున్నాడు. విశాలమైన స్థలంలో మధ్యలో ఇల్లు కట్టి, ఇంటి ముందు వెనుక మొక్కల కోసం ఖాళీ స్థలాన్ని వదిలేసి, ఎంతో శ్రద్ధగా పూల మొక్కలను, కొబ్బరి, మావిడి లాంటి చెట్లను పెంచిన తండ్రి అభిరుచిని ఎప్పటిలాగే మనసులోనే అభినందించాడు. ఎప్పుడో తమ చిన్నప్పుడు, తమ కోసం మొక్కల పక్కనున్న ఖాళీ స్థలంలో నాన్న వేయించిన ఉయ్యాల ఇంకా పదిలంగానే ఉంది. చిన్నప్పుడు అన్నయ్యలు, తను ఉయ్యాల్లో కూర్చోవాలని పోటీలు పడి దెబ్బలాడుకోవడం మర్చిపోలేని బాల్య స్మృతి. తమ ఇంటికి వచ్చిన స్నేహితులకు ప్రధాన ఆకర్షణ ఉయ్యాలే. నాన్నగారి స్నేహితులు కూడా చిన్నపిల్లల్లా సంబరపడుతూ ఆ ఉయ్యాల్లో కూర్చుని ఊగేవారు.

అమ్మ పూజ కోసం పూలు కోయటం, నిండిపోయిన పూల సజ్జ వైపు సంతోషంగా చూసుకోవడం తనకు ఎంతో ఇష్టమైన విషయాలు. మావిడి చెట్టుకు కాయలు కాస్తే దారినపోయే అల్లరి పిల్లలు రాళ్ళతో కాయలను కొడితే తను, అన్నయ్యలు వాళ్ళను తిడుతూ తరిమేవాళ్ళం. చెట్టు మీదకు ఎవరూ రాళ్ళు రువ్వకుండా కాపలా కాసే వాళ్ళం. చుట్టుపక్కల ఎవరి ఇళ్ళల్లోనూ మావిడి చెట్టు వుండేది కాదు. ఆ విషయం తమకెంతో సంతోషంగా, గర్వంగా ఉండేది. చెట్లతో చెలిమి చేసేవాళ్ళకు ఒంట్లో ప్రాణవాయువు, మనసులో వాటి మీద అనుబంధం ఎక్కువౌతాయేమో. ఆలోచనల నుండి, గత స్మృతుల నుండి తేరుకుని, మావిడాకులను తీసుకుని మెట్లు దిగాడు శ్రీకాంత్.

మరో గంట తర్వాత శ్రీధర్, శ్రీనివాస్ తమ తమ కుటుంబాలతో తమ్ముడైన శ్రీకాంత్ ఇంటికి వచ్చారు. అన్నయ్యలతోబాటు పండుగ కళ వచ్చినట్లు అనిపించింది శ్రీకాంత్‌కు. అనారోగ్యంతో ఉన్న శారదమ్మకు పిల్లల్ని, మనవల్ని చూడగానే ఎక్కడలేని బలం వచ్చినట్లు అనిపించింది. ఇన్నేళ్ళు బదిలీల వల్ల వేరే వూళ్లల్లో వున్న శ్రీధర్, శ్రీనివాస్ ఏడాది క్రితం ఒకరి తర్వాత మరొకరు హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. దూరంగా ఉన్న పిల్లలు తమ ఊరికే వచ్చెయ్యడం శారదమ్మకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.

"మనింటికి వస్తే మళ్ళీ ఆ ఇంటికి వెళ్ళాలని అనిపించదమ్మా..." అన్నాడు శ్రీధర్ తల్లి పక్కన కూర్చుని కబుర్లు చెబుతూ.

"అందరం ఒకేచోట వుంటే బాగుంటుంది. అద్దె ఇంట్లో అడ్జెస్ట్ కావడం తప్ప ఆనంద ఏముంటుంది?" అన్నాడు శ్రీనివాస్.

పిల్లల మాటలకు సంతోషం, బాధ రెండూ కలిగాయి శారదమ్మ మనసులో. చిన్నప్పుడు అందరూ కలిసి పెరిగిన ఇంటి మీద మమకారం ఉండటం సహజం. ఆ కాలంలో అడవిలా వున్నచోట ఈ స్థలాన్ని కొన్నప్పుడు పనికిరాని చోట తన భర్త స్థలాన్ని కొన్నాడని తను అనుకుంది. ఇక్కడ ఇల్లు కట్టడం అనేది జరుగుతుందా అనే అనుమానం తనకు కలిగేది. చూస్తుండగానే నగరంలో విపరీతమైన అభివృద్ధి, మార్పు కలిగి, తాము కొన్న స్థలానికి విలువ పెరిగింది. స్థలం పెద్దది కాబట్టి ఇల్లు కట్టిన తర్వాత మొక్కలు వేసుకునేందుకు ఖాళీ స్థలం మిగిలింది. తన భర్తకు మొక్కలంటే ప్రాణం. తనకు కూడా ఆసక్తి ఉండటంతో భర్తతోబాటు తనుకూడా మొక్కలను శ్రద్ధగా పెంచింది. అందరూ మెచ్చుకుని, అసూయ పడేలా వుండేది తమ తోట. ఆర్థికంగా ఉన్నత స్థితిలో లేనందువల్ల పిల్లలను పెంచి, మంచి చదువు చదివించేందుకే ఆయన ఆర్జన సరిపోయింది. ఇంటిపైన మరో అంతస్తు కట్టించేందుకు వీలు కాలేదు. ఉన్న ఒకే ఇంట్లో ఒక కుటుంబానికి మాత్రమే హాయిగా వుండే వీలుంది. పిల్లలు పెద్దయి, వాళ్ళకు సంసారాలు ఏర్పడ్డాయి. సొంత ఇంట్లో చోటు చాలనందువల్లే వాళ్ళు అద్దె ఇళ్లల్లో వుండాల్సి వస్తోంది... నిట్టూర్చిన శారదమ్మ మనవల పలకరింపుతో ఆలోచనల నుండి తెప్పరిల్లింది.

రాత్రి భోజనాలు అయ్యాక శ్రీధర్ సొంత ఇంటిని గురించిన ప్రస్తావన తీసుకొచ్చాడు.

"మన ఇంటి స్థలం పెద్దదే. హాయిగా అందరం ఒకే చోట ఉండచ్చు. నాకు తెలిసిన బిల్డర్ మన ఇంటి గురించి అడిగాడు. అతనికి స్థలం ఇచ్చేస్తే మన ముగ్గురికీ ఒక్కోరికి మూడు ఫ్లాట్స్ ఇస్తానని చెప్పాడు. మనం అన్ని ఇళ్లు కట్టుకోగలమా? మనకు, అతనికీ కూడా లాభమే. మీరు కూడా ఆలోచించండి" అన్నాడు.

"ఈ ఐడియా బాగుంది. ఇప్పుడు అందరూ ఫ్లాట్స్ కట్టడానికి స్థలాన్ని ఇచ్చేస్తున్నారు. హాయిగా మనకు నచ్చినట్లు కట్టించుకుంటే సరిపోతుంది. ఇప్పుడైతే అందరం ఇక్కడే వుండలేము" అన్నాడు శ్రీనివాస్.

శ్రీకాంత్ మౌనంగా ఉండిపోయాడు. "నువ్వు, అమ్మ ఆలోచించండి. నేను బిల్డర్‌కు ఏ విషయం చెప్పాలి...' అని ఇంటికి వెళ్ళాడు శ్రీధర్.

"ఇందులో ఆలోచించేదేముంది? నేను, అన్నయ్య ఈ ఇంటి మీదే చెరో ఫ్లోర్ వేసుకుంటే బోలెడంత ఖర్చవుతుంది. అదీగాక పైన వుండేవాళ్లు అన్ని మెట్లు ఎక్కడం కష్టం. ఫ్లాట్సయితే లిఫ్ట్ ఉంటుంది. త్వరగా నిర్ణయించుకో..." అన్నాడు శ్రీనివాస్.

"అలాగే" అన్నాడు శ్రీకాంత్. శ్రీనివాస్ వెళ్ళాక శ్రీకాంత్ ఆలోచనలో పడ్డాడు. అన్నయ్యల ఆలోచనలో తప్పులేదు. ఇది ఉమ్మడి ఆస్థి కాబట్టి అందరికీ ఇంటి మీద హక్కు ఉంది. ఒక్క ఇంటిన పంచుకోవడం కష్టమే. కానీ ఎంతో అందంగా ఉన్న ఈ ఇంటిని, తోటను నేలమట్టం చేసి దాని మీద ఫ్లాట్స్ కట్టడం అంటే ఎంతో బాధ కలుగుతోంది. ఈ ఇంటికి, ఈ మొక్కలకు అలవాటుపడి ఇప్పుడు అవి లేకుండా ఎలా బ్రతకడం? ఎంతో ముద్దుగా ఉండి, తమకు ఇతరులతో ప్రమేయం లేకుండా స్వతంత్ర జీవితాన్ని ఇచ్చే ఈ ఇంటిని ఎలా పడగొట్టడం? ప్రకృతితో పచ్చగా కనబడే ఈ ఇంటిని కాంక్రీట్ జంగిల్ ఎలా చెయ్యడం? ఆర్థిక అవసరాల కోసం కొన్ని రకాల అనుభూతులను దూరం చేసుకుంటున్నారు ఇప్పటి మనుషులు. మనసులో బాధ సుడులు తిరుగుతుంటే తల్లి పక్కన కూర్చున్నాడు శ్రీకాంత్.

శారదమ్మ మనసులో కూడా ఇవే భావాలు. ఈ ఆలోచనలే ఉన్నాయి. కానీ ఇది ఉమ్మడి ఆస్తి వ్యవహారం. పిల్లలు చెప్పిన మాటల్లో ఏ తప్పు లేదు. ఈ కాలానికి ఈ నిర్ణయం సమంజసమే. కొత్త నీరు వస్తే పాత నీరు కొట్టుకుపోతుంది. కాలం తీరు అంతే. మార్పు అనేది అనివార్యం. కానీ మార్పు మనుషులకు సుఖాన్ని, ఆనందాన్ని, మనశ్శాంతిని ఇవ్వగలగాలి. ఇస్తుందా లేదా అనేది నిర్ణయించేది కాలమే. ఒకప్పుడు పల్లెటూర్లో ఉన్న పెద్దవాళ్లు పిల్లల దగ్గరకు పట్టణాల్లో వచ్చి ఉండాల్సి వస్తే దాన్నో శిక్షగా భావించేవాళ్లు. తమకా జీవితం నచ్చడం లేదని విసుక్కునే వాళ్లు. ఇప్పటి పిల్లలు ఏకంగా దేశాన్నే వదిలేసి విదేశాలకు వెళ్ళిపోతున్నారు. కనీసం తన పిల్లలు అలా చెయ్యడం లేదు. ఒకే చోట తన ఎదురుగానే ఉంటామని అంటున్నారు. అదెంతో నయం. ఇంటితో, మొక్కలతో అనుబంధం విడదీయనిదే. కానీ బంధం తెంచుకోక తప్పదు. కాలంతో మారాలి.

తల్లి మాటలకు, ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకోగలిగే స్థయిర్యాన్ని కనబరచినందుకు శ్రీకాంత్ ఆశ్చర్యపోయాడు. అతని భార్య శాంతి కూడా ఆశ్చర్యపోయింది. ఏ విషయంలోనైనా కొన్ని నచ్చనివి, నచ్చేవి కూడా ఉంటాయని అనుకున్న శాంతి, శ్రీకాంత్ ఫ్లాట్స్ కట్టడానికి తమ అంగీకారాన్ని తెలిపారు.

★ ★ ★

బిల్డర్ తనే ఒక అద్దె ఇంటిని వెతికి, శ్రీకాంత్ కుటుంబం అక్కడికి మారేందుకు సాయం చేసి, అద్దె తనే భరించాడు. ఇంత మంచి సెంటర్‌లో ఫ్లాట్స్‌కి స్థలం దొరకడం అతనికి ఎంతో సంతోషాన్ని కలిగించింది.

ఇల్లు పడగొడుతున్నప్పుడు ముక్కలైన ఇంటిని, నేల కొరిగిన మొక్కలను, చెట్లను చూసి శ్రీకాంత్ మనసు విలవిలలాడింది. కంట నీరు తిరిగింది. "మావిడి చెట్టును పడగొడతారా?" దిగులుగా అంటున్న అమ్మ అతనికి గుర్తొచ్చింది. తల్లిలాగే అతనికీ మావిడి చెట్టు మీద వల్లమాలిన మమకారం.



మార్పు అనేది అనివార్యం. కానీ మార్పు మనుషులకు సుఖాన్ని, ఆనందాన్ని, మనశ్శాంతిని ఇవ్వగలగాలి. ఇస్తుందా లేదా అనేది నిర్ణయించేది కాలమే. ఒకప్పుడు పల్లెటూర్లో ఉన్న పెద్దవాళ్లు పిల్లల దగ్గరకు పట్టణాల్లో వచ్చి ఉండాల్సి వస్తే దాన్నో శిక్షగా భావించేవాళ్లు. తమకా జీవితం నచ్చడం లేదని విసుక్కునే వాళ్లు. ఇప్పటి పిల్లలు ఏకంగా దేశాన్నే వదిలేసి విదేశాలకు వెళ్ళిపోతున్నారు.

"మావిడి చెట్టును పడగొట్టకుండా అలాగే ఉంచలేరా?" అనడిగాడు బిల్డర్‌ను.

"ఉంచగలం. కానీ ఇటు పక్క వచ్చే ఫ్లాట్స్‌కు స్థలం కాస్త తగ్గుతుంది" అన్నాడు బిల్డర్.

"మరీ అంత సెంటిమెంటల్‌గా ఉంటే ఎలారా? మావిడికాయలు బజార్లో దొరుకుతాయి కదా. అనవసరంగా కాస్త స్థలం వేస్టయిపోదూ...' అన్నాడు శ్రీధర్.

"మాకూ అటాచ్‌మెంట్ ఉంది. కానీ కాస్త ప్రాక్టికల్‌గా ఆలోచించాలి కదా. ఇన్ని మొక్కలు పోయాయి. ఇంక ఆ ఒక్క చెట్టు పోతే ఏమైందిరా? ఇటుపక్క ఫ్లాట్స్‌కు స్థలం తగ్గితే ఏం బాగుంటుంది? అందరికీ స్థలం సమానంగా రావాలి కదా..." అన్నాడు శ్రీనివాస్.

శ్రీకాంత్‌కు మావిడిచెట్టును నిలువునా పడగొట్టడం అనేది భరించలేని బాధగా మారింది.

"చెట్టు ఉండటంవల్ల బిల్డింగ్‌కు ఏమైనా సమస్య వస్తుందా? స్థలం తగ్గేట్లయితే ఫ్లాట్స్‌లో ఏ ప్రదేశంలో తగ్గుతుంది..." అంటూ బిల్డర్‌ను అడిగాడు.

"బిల్డింగ్‌కు వచ్చే ప్రమాదం, నష్టం ఏమీ లేవు. కానీ ఇటు పక్క వచ్చే ఫ్లాట్స్‌కు బాల్కనీల సైజు కాస్త తగ్గుతుంది..." అన్నాడు బిల్డర్.

"ఈ తలనొప్పులన్నీ ఎందుకు? చెట్టును పడగొట్టండి" అని చెప్పి శ్రీధర్, శ్రీనివాస్ వెళ్ళిపోయారు.

శ్రీకాంత్ ప్రాణం విలవిలలాడింది. "చూడండి సార్! ఈ చెట్టును పడగొట్టకండి. ఎన్నో కాయలు కాచే పచ్చని చెట్టును ఉండనివ్వండి. దీన్ని ఇలాగే ఉంచితే బాల్కనీ వెడల్పు తగ్గుతుందని అన్నారు. ఫర్వాలేదు. ఆ ఫ్లాట్స్‌ను నేను తీసుకుంటాను" అన్నాడు.

బిల్డర్ శ్రీకాంత్ వైపు ఆశ్చర్యంగా చూశాడు. "ఇలా అన్నవాళ్లను ఇప్పటివరకు చూడలేదు సార్. స్థలం కొద్దిగా తగ్గినా దెబ్బలాడుతారు. మీరేమో చెట్టు కోసం అందుకు సిద్ధమయ్యారు..." అన్నాడు.

"మీరే స్వయంగా చూశారు కదా ఎంత మంచి తోట ఉండేదో. జాయింట్ ప్రాపర్టీ కాబట్టి నేను ఏమీ మాట్లాడలేను. మొక్కలు, చెట్లు లేకుండా ఉంటే ఇంటిని భరించలేను సార్" అన్నాడు శ్రీకాంత్.

"మీ బాధ నాకు అర్థమైందండీ. నేనూ పల్లెలో పుట్టి పెరిగాను. చదువు కోసం, బిజినెస్ కోసం సిటీలో ఉండాల్సి వచ్చింది. నాక్కూడా చెట్లంటే ఇష్టం...' అన్నాడు.

"నా ఫ్లాట్స్‌తోబాటు ఈ వరసంతా స్థలం తగ్గితే వేరే వాళ్లు ఊరుకోరు. అదే నా బాధ...' అన్నాడు శ్రీకాంత్.

తమ సొంత స్థలంలోనే తాము ఏ హక్కూ లేని పరాయివాళ్లుగా, ఏ నిర్ణయం తీసుకోలేని స్థితిలో ఉండటం అతనికి బాధ కలిగిస్తోంది. ఇళ్లతోబాటు, మనుషులతో పాటు తలనొప్పులు కూడా వస్తాయి. అదే అతనికి నచ్చని విషయం.

"మీరేం బాధపడకండి. ఫ్లాట్స్‌కు అటువైపు కాస్త ఖాళీ స్థలం వదలాలని అనుకున్నాను. అదేదో ఇటు వైపే, ఆ చెట్టున్న వరసలోనే ఆ చివరిదాకా వదిలేస్తాను. అలా చేస్తే మీ ఫ్లాట్స్‌కు స్థలం తగ్గదు. మీరు మొక్కలు కూడా వేసుకోవచ్చు..." అన్నాడు బిల్డర్.

"చాలాథాంక్సండీ..." అన్నాడు శ్రీకాంత్. ఇంటికి వెళ్ళినప్పుడు మాటల మధ్యలో ఈ విషయాన్ని తల్లితో చెప్పాడు. శారదమ్మ మొహం సంతోషంతో వికసించింది. ఆనాటి రాత్రి ప్రశాంతంగా కన్నుమూసింది.

★ ★ ★

ఏడాది తర్వాత శ్రీకాంత్ వాళ్ళ స్థలంలో కడుతున్న ఫ్లాట్స్ నిర్మాణం పూర్తయింది. ముగ్గురు అన్నదమ్ములు ఒకేరోజు గృహప్రవేశం చేశారు. వాళ్ళ ఇంటి గుమ్మాలకు తోరణాలుగా వేలాడినవి ఆ మావిడిచెట్టు ఆకులే.

శ్రీకాంత్ పడక గది తలుపులు తీశాడు. బాల్కనీ నుండి, కిటికీ నుండి పచ్చటి మావిడి చెట్టు కనపడింది. చల్లటి గాలి అతని ఒంటిని నిమిరింది. అతని కళ్లు సంతోషంతో చెమర్చాయి. తల్లిని బతికించుకునే శక్తి ఒక మనిషిగా తనకు లేకపోయినా, తల్లిలాంటి చెట్టును, ఆ తల్లి వేరును తెగ నరకకుండా కాపాడుకోగలిగినందుకు అతనికి సంతోషం కలిగింది.

★ ★ ★

ఇప్పుడా ఇల్లు ఒకప్పటిలా లేదు. మారిన కాలానికి, విలువలకు ప్రతినిధిలా ఉంది. కానీ శ్రీకాంత్ కృషి వల్ల ఆ ఇళ్ళ ముందు, బాల్కనీల్లోను, ఎండ తగలని గుమ్మాలకు పక్కన పచ్చని మొక్కలు, పూల చెట్లు అందంగా కనపడుతూ తాము బతుకుతూ మనుషులను ఆరోగ్యంగా బతికిస్తున్నాయి.

★